క్లుప్తంగా

నర్సరీ పరిశీలన



అయిజ: నర్సరీలలో మొక్కలను సంరక్షించాలని మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న అన్నారు. మంగళవారం పట్టణ సమీపంలోని నర్సరీని ఆయన పరిశీలించారు. మొక్కల మధ్య కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలని, ఎరువులను వాడుతూ అవసరమైన మేరకు నీరు పోయాలని పలు సలహాలు, సూచనలు చేశారు. వేసవికాలంలో మొక్కలు ఎండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం



శాంతినగర్: హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ శాసన మండలి బీజేపీ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డికి మద్దతుగా నాయకులు మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వడ్డేపల్లి, శాంతినగర్‌లలో ఉపాధ్యాయుల ఇంటింటికి వెళ్లి ఏవీఎన్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి భీంసేన్‌రావ్, నర్సింహ, రామకృష్ణ, సంజీవరెడ్డి, రాజు, అశోక్‌లు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



ధరూరు: విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందగా రైతు ప్రాణాలతో బయటపడిన సంఘటన మండలంలోని మార్లబీడులో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన యువ రైతు కుర్వ నర్సింహులు వ్యవసాయ పొలంలో కాడెద్దులతో వివిధ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలాయి. దీంతో ఎద్దు అక్కడిక్కడే మృతి చెందింది. ఎద్దును కాపాడే క్రమంలో యువ రైతు నర్సింహులుకు విద్యుదాఘాతానికి గురయ్యాడు. పక్క పొలంలో ఉన్న రైతులు గమనించి రైతును కాపాడారు. నర్సింహులును గద్వాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. సర్పంచు సుజాతశ్రీరాములు, గ్రామస్తులు బాధితుడి పరామర్శించారు. మృతి చెందిన ఎద్దు విలువ రూ.లక్ష వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు.

చల్లాకు శుభాకాంక్షల వెల్లువ

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే చల్లా వెంకట్రామిరెడ్డికి ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఖరారు కావడంతో మంగళవారం బీఆర్ఎస్ నాయకులు చల్లాను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రాగటూరుకు చెందిన సర్పంచు పవిత్ర, నాయకులు జనార్దన్ రెడ్డి, పటాకాలు సంతోషం వ్యక్తం చేశారు. చల్లా మరిన్ని ఉన్నత పదవులు వరించి ఉన్నత స్థిరపడాలని ఆకాంక్షించారు. సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ప్రాగటూరు నాయకులు జనార్దన్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, సుబ్బన్న, వాజెందర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అలంపూర్: అలంపూర్ మాజీ ఎమ్మెల్యే చల్లా వెంకట్రామిరెడ్డికి సీఎం కేసీఆర్ ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వడంపై నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు మానవపాడు, ఇటిక్యాల,వడ్డేపల్లి తదిదర మండల కేంద్రాలు, ఆయా గ్రామాల్లో, కర్నూల్ జిల్లా కేంద్రంలోని చల్లా కాంపౌండ్‌లో పెద్ద ఎత్తున పటాకులు కాల్చి స్వీట్లు పంచి పెట్టారు.

నేడు బండలాగుడు పోటీలు



పెబ్బేరు రూరల్: రంగనాథస్వామి జాతర సందర్భంగా శ్రీరంగాపురం మండల కేంద్రంలో నిర్వహించనున్న అఖిల భారత ఒంగోలు జాతి బండలాగుడు పోటీల ఏర్పాట్లను మంగళవారం హనుమాన్ యూత్ నాయకులు పరిశీలించారు. ఈ పోటీలు బుధవారం నుంచి ప్రారంభించే ఈ పోటీలకు అన్ని వసతులు కల్పించాలని రైతు సంఘాల నాయకులకు సూచించారు. కార్యక్రమంలో కన్వీనర్ మందాడి చిదంబర్‌రెడ్డి, హరిప్రసాద్, కమిటీ అధ్యక్షులు జర్లు కాళ్ల రాఘవేందర్‌శెట్టి, రాజుల శివ, గంగాధర్‌యాదవ్, సంపత్‌నాయుడు, దాసరి కృష్ణ, నరేష్‌నాయుడు, రాఘవేంద్ర పాల్గొన్నారు.



రాజోళిలో చిన్నారుల సంబరాలు



మల్దకల్ మండలం అమరవాయిలో..



ఉండవెల్లిలో చిన్నారులు

అంబరాన్నంటిన హోలీ సంబరం

జిల్లా వ్యాప్తంగా హోలీ సంబరాలను అంబరాన్నంటాయి. పండుగ పురస్కరించుకొని సోమవారం రాత్రి కాముడి దిష్టిబొమ్మను ఊరేగించారు. యువకులు కేరింతల నడుమ కూడళ్ల వద్ద దహనం చేశారు. మంగళవారం ఒకరిపై మరొకరు రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా గడిపారు. చిన్నారులు, యువతీ యువకులు, పెద్దలు రంగు డబ్బాలను చేతిలో పట్టుకుని వీధివీధికి తిరుగుతూ స్నేహితులకు, సన్నిహితులకు రంగులు చల్లుతూ, సెల్ఫీలు దిగుతూ సంబరాలు చేసుకున్నారు. వివిధ గ్రామాల్లో యువకులు బైక్ ర్యాలీలు నిర్వహించారు. ఒకరి కొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రాజకీయ నాయకులు, అధికారులు, విద్యార్థులు, మహిళలు, పెద్ద సంఖ్యలో హోలీ వేడుకల్లో పాల్గొన్నారు.

–సాక్షి, నెట్‌వర్క్



గట్టులో హోలీ సంబరాలలో యువకులు



కేటీదొడ్డిలో హోలీ ఆడుతున్న యూత్ సభ్యులు



మానవపాడు మండలం చెన్నిపాడులో..



జిల్ల కేంద్రంలో హోలీ వేడుకల్లో చిన్నారుల సందడి



ధరూరులో..



అయిజలో హోలీ వేడుకల్లో యువకులు



గద్వాలలో మహిళల సందడి



హోలీ వేడుకల్లో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి దంపతులు

శాంతినగర్‌కు చేరిన సంగ్రామయాత్ర



శాంతినగర్: మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన మాదిగల సంగ్రామ పాదయాత్ర మంగళవారం 3వ రోజు శాంతినగర్‌కు చేరుకుంది. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు కొంకల భీమన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 3న బీజేపీ రాష్ట్ర కార్యాలయాన్ని, 4న రాష్ట్ర రాజధానిని ముట్టడి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మస్తాన్, రాజు, జయరాజు, ఆంజనేయులు, శ్రీను, కృష్ణకాంత్, యేసేపు, ధనుంజయలు పాల్గొన్నారు.

వైద్య శిబిరం విజయవంతం



ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌బీఐ సంజీవని ఆధ్వర్యంలో రెండురోజుల పాటు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మొత్తం 700 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యులు తెలిపారు. అదేవిధంగా మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచు రేఖ, ఏఎన్ఎంలు షాజహాన్, వినోదిని, ఎస్‌బీఐ రాష్ట్ర ప్రాజెక్ట్ మేనేజర్ వినయ్, సిబ్బంది నాగరాజు, షబ్బీర్, తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా శ్రీవారి కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రంలోని స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణం మంగళవారం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు రమేషాచారి, మధుసూధనాచారి, రవిచారిలు స్వామివారి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా మహాహోమం నిర్వహించి వేద మంత్రోచ్చరణల మధ్య కల్యాణం జరిపించారు. శ్రీవారి కల్యాణం తిలకించేందుకు భక్తులు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈఓ సత్యశ్చంద్రారెడ్డి, సీతారామిరెడ్డి, మధసూదన్‌రెడ్డి, చంద్రశేఖర్ రావు, దీరేంద్రదాసు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై కళాజాతా



అవగాహన కల్పిస్తున్న కళాజాతా బృందం సభ్యులు

మల్దకల్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ శేఖర్ సూచించారు. మంగళవారం మండలంలోని ఎల్కూర్‌లో సైబర్ నేరాలపై కళాజాతా ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాజాతా బృందం సభ్యులు కృష్ణ, రామాంజనేయులు మూఢ నమ్మకాలు, బాల్య వివాహాలు, సైబర్‌నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసర సమయంలో 100కు డయల్ చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచు రాధ, కళాజాత సభ్యులు రంగస్వామి, పోలీసు సిబ్బంది కుమార్, శేషన్న, హనుమంతు, నిరంజన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ధ్యానం ద్వారా శరీరం, మనస్సు శుద్ధి



అవగాహన కల్పిస్తున్న పీఎస్ఎస్ఎం సభ్యులు

శాంతినగర్: ప్రతి రోజు శ్వాస మీద ధ్యాస ఉంచి ధ్యాన సాధన చేస్తే శరీరం, మనస్సు శుద్ధి అవుతాయని పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి బంగ్లా ఆంజనేయరెడ్డి అన్నారు. వడ్డేపల్లి మండలంలోని బుడమొర్సు, గాంధీనగర్, పైపాడు గ్రామాల్లో మంగళవారం ధ్యానంపై అవగాహన కల్పించారు. మాంసాహారం తీసుకోవడం ద్వారా రోగాలబారిన పడుతామన్నారు. శాకాహారంతో ఆరోగ్యంగా ఉంటామని అదేవిధంగా రోగాలు దరిచేరవన్నారు. కార్యక్రమంలో ధ్యాన ప్రచార కార్యకర్తలు రాజమోహన్, కృష్ణమద్దిలేటి, పిరమిడ్ మాస్టర్లు సంగు వెంకటేశ్వర్లు, వరలక్ష్మి, స్వప్న, రాధ, సుభద్ర, శైలజ, శోభితలు పాల్గొన్నారు.

బాల గోపాల్ రెడ్డి మృతి తీరనిలోటు

గద్వాల అర్బన్: కార్మిక సంఘం నాయకుడు బాలగోపాల్ రెడ్డి మృతి తీరనిలోటని ప్రజా సంఘాల నాయకులు, వివిధ సంఘాల నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, అతికూర్ రహ్మాన్, ఆంజనేయులు, వెంకటస్వామి, వీరుబాబు, ఏఐటీయూసీ నాయకులు అన్నారు. ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. మంగళవారం బాలగోపాల్ రెడ్డి నివాసానికి చేరుకొని భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్

గద్వాల క్రైం: జిల్లా కేంద్రంలోని ఓ దుస్తుల దుకాణంలో సోమవారం రాత్రి ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ సంభవించింది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గాంధీచౌక్ సమీపంలోని జీషన్ దుస్తుల దుకాణంలో రాత్రి 11:40 నిమిషాల సమయంలో షార్ట్ సర్క్యూట్ ఏర్పడింది. ప్రమాదంలో రూ.4 లక్షల విలువ చేసే సామగ్రి అగ్నికి ఆహుతైంది. స్థానికులు గమనించి ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటన స్థలం వద్దకు చేరుకున్న ఫైర్ సిబ్బంది విద్యుత్ సరఫరాను నిలిపివేసి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. సకాలంలో స్థానికులు స్పందించి ఫైర్ సిబ్బందికి తెలియజేయడంతో పెను ప్రమాదం తప్పిందని ఫైర్ సిబ్బంది తెలియజేశారు. విషయం తెలుసుకున్న యజమాని హమ్మద్‌పాషా అక్కడికి చేరుకుని ఆవేదన వ్యక్తం చేశారు.

గురుకులను పరిశీలించిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



పుల్లూరు గురుకులాను పరిశీలిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు గురుకుల పాఠశాలలో 'మా బాధలు పట్టవా' అనే శీర్షిక మంగళవారం సాక్షి దినపత్రికలో వార్త ప్రచురితమైంది. దీంతో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ స్పందించి విద్యార్థుల సమస్యలను తెలుసుకునేందుకు గురుకుల పాఠశాలను సందర్శించారు. తాగునీరు, మరుగుదొడ్ల సమస్య తీవ్రంగా ఉందని విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థులకు సరిపడా తాగునీరు సరఫరా చేయాలని ప్రిన్సిపాల్ గీతను ఆయన కోరారు. బోర్ల నుంచి నీరు తక్కువగా వస్తుందని దీంతో సమస్య తలెత్తిందని వివరించారు. మూడు రోజులుగా విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థి బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రశ్నించేతత్వం అలవర్చుకోవాలన్నారు. తాగునీటి కోసం విద్యార్థులకు మిషన్ భగీరథ నీటిని అందించేలా కృషి చేస్తున్నామని మిషన్ భగీరథ అధికారులు తెలిపారు. కేశవులు, మహేష్, ప్రభుదాసు, శివ, తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి



మాట్లాడుతున్న నరసింహ

అలంపూర్: గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని స్థానిక కేవీపీఎస్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్మికులతో మండల కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులకు ఒకే రకమైన వేతనాలు, మల్టీపర్పస్ విధానం, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. బీపీ 60 ప్రకారం పంచాయతీ కార్మికులకు నెలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని కోరారు. నాలుగు నెలల నుంచి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే జీతాలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలన్నారు. అనంతరం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మద్దిలేటి, కార్యదర్శిగా సిద్ధు, కోశాధికారిగా సుధాకర్, సభ్యులుగా గీత, నాగేశ్వరమ్మ, వీరన్న, మహేంద్ర, నరసింహ, హుసేనమ్మ, శేఖర్, బజారన్నలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ జిల్లా కార్యదర్శి ఏమేలమ్మ, పంచాయతీ వర్కర్లు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుపై అనాసక్తి..

- ఇప్పటివరకు 12 ఎకరాల్లో సాగు
- ఫ్యాక్టరీ ఏర్పాటులో స్పష్టత కరువు
- సాగు, విక్రయాలపై అవగాహన లేక వెనకడుగు



నర్సరీలో సిద్ధంగా ఉన్న ఆయిల్‌పామ్ మొక్కలు

ఉండవెల్లి: ఆయిల్‌పాం పంట సాగు చేస్తే తక్కువ పెట్టుబడి అధిక లాభాలు ఆర్జించవచ్చు. కాని రైతులకు అవగాహన కల్పించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ఆసక్తి చూపడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఆయిల్‌పాం సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం మొక్కలు, డ్రిప్ పరికరాలు సబ్సిడీపై అందిస్తోంది. అయినప్పటికీ సాగుపై, పంట విక్రయాలపై రైతుల్లో విభిన్న సందేహాలు నెలకొనడంతో ఉండవెల్లి మండలంలోని రైతులు ఆయిల్‌పామ్ సాగుపై వెనకడుగు వేస్తున్నారు. ఇప్పటివరకు మండలంలో 12 ఎకరాల్లో మాత్రమే మొక్కలు నాటడమే నిదర్శనం.

100 ఎకరాల సాగుకు దరఖాస్తులు..

మండలంలో 15 గ్రామాలున్నాయి. రైతులు ఎక్కువగా మొక్కజొన్న, మినుములు, వరి, కురగాయలు, పప్పుదినుసుల పంటలను సాగు చేస్తుంటారు. మార్కెట్లో ఆయిల్‌పాంకు మంచి డిమాండ్ ఉండడంతో ప్రభుత్వం సాగు పెంచాలని, అందుకు సబ్సిడీపై మొక్కలు, డ్రిప్ పరికరాలు అందిస్తామని ప్రకటించింది. ఇందుకోసం రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. 150 ఎకరాల్లో ఆయిల్‌పాం పంట సాగు చేస్తామని 100 మంది రైతులు అప్పట్లో దరఖాస్తులు సమర్పించారు. ఇదంతా బాగానే ఉన్నప్పటికి పంట సాగుపై అవగాహన లేకపోవడంతో ఏదైన చీడ పురుగులు ఆశిస్తే ఏమి చేయాలో తెలియక సాంప్రదాయ పంటలకే మొగ్గు చూపాల్సిన పరిస్థితి నెలకొంది.

ఫ్యాక్టరీ ఏర్పాటుపై స్పష్టత కరువు

ఆయిల్‌పామ్ సాగు కోసం దరఖాస్తు చేసుకున్న రైతులందరినీ పంటల సందర్శనకు తీసుకెళ్లకపోవడంతో ముందడుగు వేయలేకపోతున్నారు. ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ఎక్కడ ఏర్పాటు చేస్తారనే విషయంలో స్పష్టత లేదు. పంటకు ధర విషయంలో సందేహాలు నివృత్తి చేసే వారు లేక ఆసక్తి చూపించలేకపోతున్నామని మండలంలోని రైతులు తెలిపారు.

నల్లరేగడిలో ఇబ్బందులు వస్తాయని



మండలంలోని ఉండవెల్లిలో బోరు కింద ఆయిపాంసాగు చేయడానికి ఆసక్తి ఉంది. కాని నల్లరేగడి కావడంతో ఇబ్బందులకు గురవుతామని వరిని, ఆముదాలను సాగు చేస్తున్నాం. సాగు చేశాక పంట చేతికిరాకపోతే నష్టపోతాం. సాగు అయిన తరువాత కొనుగోలు ఇబ్బందులు తలెత్తుతాయని పంటను సాగు చేయలేకపోతున్నాం.

–వేణుగోపాల్ రెడ్డి, రైతు, ఉండవెల్లి

వినియోగించుకోవాలి

ఆయిల్‌పామ్ పంట సాగు చేస్తే రైతులకు లాభమే, ప్రభుత్వం సబ్సిడీపై మొక్కలు, డ్రిప్ పరికరాలు అందిస్తుంది. ఎకరం పంట సాగు చేస్తే ప్రభుత్వం ఏడాదికి రూ.4200 చొప్పున నాలుగేళ్లపాటు మంజూరు చేస్తుంది. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. రైతులకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం. సాగు విస్తీర్ణం పెంచేందుకు కృషి చేస్తాం. సాంప్రదాయ పంటలకు స్వస్తి పలకాలి.

–చంద్రశేఖర్, ఆయిల్‌పామ్ జిల్లా కో ఆర్డినేటర్

వీరారెడ్డి సేవలు చిరస్మరణీయం

ఆత్మకూర్: ఆప్కాబ్ మాజీ చైర్మన్, అమరచింత మాజీ ఎమ్మెల్యే వీరారెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గంగాధర్‌గౌడ్, మండల అధ్యక్షుడు పరమేష్, పట్టణ అధ్యక్షుడు నల్గొండ శ్రీను అన్నారు. మంగళవారం ఆత్మకూర్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద వీరారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు.

పేదల కోసం నిరంతరం పోరాటం

మదనాపురం: నాటి అమరచింత నియోజకవర్గంలోని పేదలకు అండగా ఉంటూ అభివృద్ధి కోసం పరితపించిన గొప్ప నేత మాజీ ఎమ్మెల్యే, ఆప్కాబ్ మాజీ చైర్మన్ వీరారెడ్డి మాత్రమేనని, ఆయన తుది శ్వాస వరకు పేదల కోసం పోరాడిన నాయకుడని టీపీసీ ప్రధాన కార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్ కొనియాడారు. మండల కేంద్రంలో మంగళవారం వీరారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రామచంద్రయ్య మాదరి, సత్యశీలారెడ్డి పాల్గొన్నారు.